సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్

వైద్య సేవలు అందించడంలో జిల్లా ముందుండాలి : డీఎంహెచ్ఓ

భువనగిరి అర్బన్, నవంబర్ 6 : ప్రజలకు వైద్యం అందించడంలో జిల్లా ముందంజలో ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో భువనగిరి డివిజన్ పీహెచ్సీ సిబ్బందితో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీహెచ్సీల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో విచారణ

విచారణ నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యశ్రీరావు

చౌటుప్పల్, నవంబర్ 6 : హైదరాబాద్లోని కింగ్ కోఠి హాస్పిటల్ సీఎస్ఎస్ గైనిక్ డాక్టర్ సూర్యశ్రీరావు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో విచారణకు వచ్చారు. ఇటీవల మహిళా సైనికురాలు కాన్పు కోసం దవాఖానకు రాగా.. సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అదే విధంగా వైద్యుల నిర్లక్ష్యంతో గర్భస్థ శిశువు మృతి చెందడం వంటి ఆరోపణలతో వైద్యవిధాన పరిషత్కు విశ్రాంత వైద్యుడు పగిడిపాటి సుధాకర్ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిమిత్తం వచ్చిన సూర్యశ్రీ.. ఆస్పత్రి గత సూపరింటెండెంట్ అలివేలు గురించి 13 మందిని విచారించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ఫలితాల ఆధారంగా చర్యలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నానాయక్, దవాఖాన సూపరింటెండెంట్ రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొలనుపాక విద్యార్థులు

ఆలేరురూరల్, నవంబర్ 6 : మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్ఎస్కు చెందిన 10వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఆకుల వేణుగోపాల్, పీడీ జోసెఫ్ బుధవారం తెలిపారు. ఇటీవల ఆలేరులో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడల్లో పాఠశాలకు చెందిన మనోజ్కుమార్, ధనూశ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అధికారుల మధ్య వాగ్వాదం

పాదయాత్ర ఏర్పాట్ల పనుల విషయంలో వాగ్వాదానికి దిగిన అధికారులు

వలిగొండ, నవంబర్ 6 : మండలంలోని సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వా నుంచి 8వ తేదీన సీఎం రేవంత్ చేస్తున్న పాదయాత్ర ఏర్పాట్ల పనుల్లో సమన్వయ లోపంతో అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరిగేషన్ శాఖ అధికారులెవరు ఇక్కడ కనిపిస్తలేరు. ఇక్కడి పనులు మీశాఖ వారు పట్టించుకోరా అని రోడ్లు భవనాలశాఖ ఈఈ బాలప్రసాద్ వారిని ప్రశ్నించారు. అక్కడే ఉన్న ఇరిగేషన్ శాఖ డీఈ బాలకృష్ణ స్పందిస్తూ మా శాఖ గురించి నీకెందుకు, అసలు మమ్మల్ని అడగడానికి నువ్వెవరు? అని ఎదురు ప్రశ్న వేయడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఈ నేపథ్యంలో నువ్వెంత.. అంటే నువ్వెంత అని ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. తతంగమంతా అదనపు కలెక్టర్ సమక్షంలో చోటు చేసుకోవడం గమనార్హం.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వలిగొండ, నవంబర్ 6 : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలో గల మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి 15వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్ను ఎమ్మెల్యే కుంభం అనిల్కుమార్రెడ్డి హైదరాబాద్లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈఓ మోహన్బాబు, నరేశ్రెడ్డి, అర్చకులు, పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి : కిరణ్కుమార్

బీబీనగర్, నవంబర్ 6 : డీవైఎఫ్ఐ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల కార్యదర్శి మంద కిరణ్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలో బుధవారం మహాసభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు పబ్బతి యాదగిరి, విష్ణు, ఓవల్ దాస్ సతీశ్, బస్వా రెడ్డి, బాలరాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగులు మనోధైర్యంతో లక్ష్యాన్ని సాధించాలి : ఈశ్వరయ్య

రామన్నపేట, నవంబర్ 6 : దివ్యాంగులు మనో ధైర్యంతో తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని బెస్ట్ సేవా సోసైటీ వ్యవస్థాపకుడు బుక్కా ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామంలో సోసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు, గ్రామపంచాయతీ సిబ్బందికి బచ్చు విక్రమ్, సుస్మిత సహకారంతో బుధవారం దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వేములసైదులు, కర్నాటి వెంకటేశ్వర్లు, పిట్ట రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై పోరాడాలి : సీపీఎం

రామన్నపేట, నవంబర్ 6 : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో పార్టీ 8వ గ్రామ మహాసభకు బుధవారం ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం సీపీఎం గ్రామశాఖను ఎన్నుకున్నారు.

సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి

రామన్నపేట, నవంబర్ 6 : దేవాలయాలు, మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ పి.మల్లయ్య నిర్వాహకులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో దేవాలయ, మసీదుల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : కుమారస్వామి

ఆలేరురూరల్, నవంబర్ 6 : రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండలాధ్యక్షుడు పూజారి కుమారస్వామి అన్నారు. మండలంలోని శారాజీపేట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీను, శ్రీనివాస్, శంకర్, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ కలెక్టర్కు పిర్యాదు

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఓ వ్యక్తి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని బాహుపేట గ్రామస్తులు బుధవారం కలెక్టర్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పూర్తి విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని స్థానిక తాసీల్దార్ను ఆదేశించారు. రైతులు సిద్ధయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, యాకయ్య, కొమురయ్య, సిద్దిరాజు, యాదగిరి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రామచంద్రారెడ్డి

భూదాన్పోచంపల్లి, నవంబర్ 6 : సీపీఎం మండల కార్యదర్శిగా కనుముకుల గ్రామానికి చెందిన కోట రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 13 మందితో నూతన మండల కమిటీని, ఆరుగురితో కార్యదర్శి వర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

బోరు మోటార్లు ప్రారంభం

చౌటుప్పల్, నవంబర్ 6 : మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో రెండు బోర్లు తవ్వించి, మోటార్లు, పైప్లైన్ ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం పంచాయతీ సెక్రటరీ రమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

• అదనపు కలెక్టర్ గంగాధర్

తుర్కపల్లి : మాధాపురంలో ఇంటింటికి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జడ్పీసీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 6 : ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. మండలంలోని వడాయిగూడెం గ్రామంలో ఇండ్లకు స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వేను తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట జడ్పీసీఈఓ శోభారాణి ఉన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో కుటుంబ సర్వేను ఎమ్మెల్యే కుంభం అనిల్కుమార్రెడ్డితో కలిసి ఎంపీ కిరణ్కుమార్రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.

యాదగిరిగుట్ట : కుటుంబ సర్వేలో భాగంగా ఇండ్లకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పట్టణంలోని బీసీ కాలనీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్, కౌన్సిలర్ వాణిభరత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అజయ్కుమార్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యారెడ్డి పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలంలోని మాధాపురం గ్రామంలో కుటుంబ సర్వే వివరాలను జడ్పీసీఈఓ శోభారాణి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంఈఓ మాలతి తదితరులున్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని పలు వార్డుల్లో ప్రారంభించిన ఇండ్ల స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్యుమరేటర్లు బుధవారం ఇండ్లను గుర్తించారు. ఇన్చార్జీ ఎంపీఓ లోకేశ్వర్రెడ్డి మండలంలోని పల్లెర్ల, కూరెళ్ల, లింగరాజ్పల్లి, ఆత్మకూరు(ఎం), తుక్కాపురం గ్రామాలను సందర్శించి పరిశీలించారు.

ఆలేరురూరల్/రాజపేట : ఆలేరు మండల వ్యాప్తంగా చేపడుతున్న సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి గోపాల్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రాజపేట మండలంలోని పాముకుంటలో హెచ్ఎం ధనలక్ష్మి ఆధ్వర్యంలో స్టిక్కరింగ్ కోసం ఇండ్లను సందర్శించారు.

భూదాన్పోచంపల్లి : మున్సిపాలిటీలో 41 బ్లాక్లకుగాను 35 మంది, మండలంలోని 22 గ్రామాల్లో 69 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్ అంటించారు. ఎంపీడీఓ రాపర్తి భాస్కర్గౌడ్, ఆర్ఐ వెంకట్రెడ్డి ఉన్నారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా ఎంపీడీఓ యాకూబ్నాయక్, ఎంపీఓ రవూఫ్అలీ పలు గ్రామాల్లో పర్యటించి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు.

మోత్కూరు : పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న సర్వే తీరును మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీర్ శ్రవణ్కుమార్, సిబ్బంది ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం : ఇన్చార్జి ఎంపీడీఓ నరసింహారావు ఆధ్వర్యంలో మండలంలో సర్వే ప్రారంభించారు. తాసీల్దార్ కృష్ణ, ఎంఈఓ శ్రీనివాస్, ఏపీఓ ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనానికి ఆహ్వానం

భువనగిరి అర్బన్, నవంబర్ 6 : ఈనెల 9వ తేదీన పట్టణంలో నిర్వహించే సదర్ సమ్మేళనానికి కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్లో ప్రముఖులను కలిసి ఆహ్వానించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్ బుధవాం తెలిపారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్కుమార్రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేశ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తోట కూరి వెంకటేశ్, వడిచర్ల కృష్ణ, నరాల వెంకటస్వామి, సురేశ్, జి.బసవయ్య, జంగయ్య, ర్యాకల రమేశ్, రంజిత్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

వలిగొండ, నవంబర్ 6 : మండలంలోని అరూరు గ్రామ పరిధిలో బైక్ అదుపు తప్పి బుధవారం యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సారగండ్ల నవీన్కుమార్(27) చౌటుప్పల్ మండలంలోని ఎస్.లింగోటం గ్రామ పరిధిలోని ప్రతిష్ట కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా అరూరు గ్రామ పరిధిలో గల కంఠమహేశ్వరస్వామి ఆలయం వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడింది. ఘటనలో నవీన్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు చికిత్స నిమిత్తం హైదారాబాద్లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

బస్టాండ్ సమీపంలో మృతదేహం

భువనగిరి అర్బన్, నవంబర్ 6 : పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వ్యక్తి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చునని, ఆరెంజ్ కలర్ టీషర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా దవాఖాన మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, నవంబర్ 6 : పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి ఏరియా దవాఖాన ముందున్న తాతానగర్ రోడ్డు వరకు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కృష్ణసాయి బుధవారం తెలిపారు. ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా 33 కేవీ, 11 కేవీ, ఎల్ టటీ లైన్లను టవర్ మీదికి మార్చే పనుల్లో భాగంగా సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుట్ట అభివృద్ధిపై హామీ ఇవ్వాలి : వెంకటేశ్వర్లు

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనానికి వస్తున్న సీఎం రేవంత్రెడ్డి ఈ ప్రాంతం అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్గౌడ్, పాశం భాస్కర్, కాదూరి అచ్చయ్య, రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, మల్లేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి : ఏడీఏ



కొలనుపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ పద్మావతి

ఆలేరురూరల్, నవంబర్ 6 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆలేరు ఏడీఏ పద్మావతి అన్నారు. మండలంలోని కొలనుపాకలో బుధవారం సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతె మైసయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె మల్లేశ్గౌడ్, సూపర్వైజర్ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏపీఎం మీనా, ఏఈఓ శివకుమార్, ఇన్చార్జి కల్యాణి తదితరులున్నారు.

భువనగిరికలెక్టరేట్ : చందుపట్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చందుపట్ల, బండసోమారం, ఎర్రంబెల్లి, గౌస్నగర్, వీరవెల్లి, చీమలకొండూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. సుబ్బురు మహేందర్, గంధమల్ల వెంకటేశ్వర్లు, పెద్దింటి మల్లారెడ్డి, నల్ల లక్ష్మీశంకరయ్య, బ్యాంకు సీఈఓ దంతూరి నర్సింహా గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని నర్సాపురం, జాల, నేమిలె, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్రెడ్డి ధాన్యం కొనుగోలే కేంద్రాలను ప్రారంభించారు. బ్యాంక్ సీఈఓ సిల్వర్ శేఖర్, డైరెక్టర్లు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని దూదివెంకటాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి జినుకల శ్యాంసుందర్ పరిశీలించారు. అంతే కాకుండా నేమిలె, పారుపల్లి, బొందుగుల, జాల, న్యూ జాల, సింగారం, పాము కుంట, కుర్రారం గ్రామాలను ఆయన సందర్శించి సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీఓ కిషన్, ఏఈఓ ప్రణీత ఉన్నారు.

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి బుధవారం ప్రారంభించారు. నాయకులు గంగుల రాజిరెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, ముత్యాల సుజాత, అక్రం, పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మోత్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మోత్కూరు, నవంబర్ 6 : ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు మండలాల్లో బుధవారం ఆయన పర్యటించి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.యాదయ్య, ఉపాధ్యక్షుడు వెంకటాచారి, పి. శ్రీనివాస్, డి.వెంకన్న, సత్తయ్య, శ్రీనివాస్, సోమయ్య పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్లు పరిశీలన

మునిపంపులలో మాట్లాడుతున్న రామకృష్ణ

రామన్నపేట, నవంబర్ 6 : మండలంలోని ఇంద్రపాలనగరం, సిరిపురం, వెల్లంకి, గ్రామాల్లోని హెల్త్ సబ్ సెంటర్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ పరిశీలించారు. అనంతరం మునిపంపుల పీహెచ్సీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్విన్కుమార్, సీహెచ్ఓ చంద్రకళ, హెచ్ఈఓ గోపాల్, పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని వినతి

ఆత్మకూరు(ఎం), నవంబర్ 6 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 5 ఏండ్ల నుంచి పంపు ఆపరేటర్, కారోబార్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న కార్మికులను కలెక్టర్ ఆదేశాల మేరకు 10రోజుల క్రితం తొలగించారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆనంద్కుమార్కు బాధితులు వినతిపత్రం అందించారు. లక్ష్మయ్య, హరిబాబు, గోవర్ధన్, శివనారాయణ, రాములు, సరిత, అనిల్, నరేశ్ తదితరులున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీని అరికట్టాలి : సీపీఎం

మోత్కూరు, నవంబర్ 6 : మండలంలోని పాటిమట్లలో మిషన్ భగిరథ పైపులైన్ లీకేజీని అరికట్టి, రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. గ్రామంలో పైపులైన్ లీకేజీ వద్ద బుధవారం నిరసన తెలిపి మాట్లాడారు. నాయకులు కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, దొండ నాగరాజు, మెతుకు సాయిలు, బండి రవి పాల్గొన్నారు.

జిల్లా సమస్యలను సీఎంకు వివరిస్తాం : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : సీఎం రేవంత్రెడ్డిని కలిసి జిల్లాలో నెలకొన్న సమస్యలను వివరిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్టలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 26 నాటికి 100 ఏండ్లు అవుతున్న నేపథ్యంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, గోరేటి రాములు, మహేందర్, శ్రీధర్, పెంటయ్య పాల్గొన్నారు.

సుదర్శన నారసింహ హోమం

నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమాన్ని బుధవారం వైభవంగా జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ, నిత్య తిరు కల్యాణం జరిపారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సువర్ణమూర్తులకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన గావించారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్కుమార్రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, అనిల్కుమార్రెడ్డి

సీఎం పాదయాత్ర ఏర్పాట్లు పరిశీలన

వలిగొండ, నవంబర్ 6 : ఈ నెల 8వ తేదీ మండలంలోని సంగెం గ్రామపరిధిలోని భీమలింగం కత్వా నుంచి సీఎం రేవంత్రెడ్డి మూసీ నది ప్రక్షాళన పునరుజ్జీవన పాదయాత్ర చేయనున్న సందర్భంగా ఆ ప్రాంతాన్ని ఎంపీ చామల కిరణ్కుమార్రెడ్డి, ఎమ్మెల్యే అనిల్కుమార్రెడ్డి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఎమ్మెల్యేలు వీరేశం, మందుల సామేల్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్బాబు, డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీ వీరారెడ్డి, ఏసీపీ మధుసూధన్రెడ్డి, ఆర్డీఓ శేఖర్రెడ్డి, ఎంపీడీఓ జితేందర్రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత : సీపీ సుధీర్బాబు

ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్బాబు తెలిపారు. సుమారు 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు(ఎం) : పీఏసీఎస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆత్మకూరు(ఎం), నవంబర్ 6 : మండల కేంద్రంలో రూ.30లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సౌకర్యాలతో పీఏసీఎస్ నూతన కార్యాలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్రెడ్డి, వైస్ చైర్మన్ గంధమల్ల జహంగీర్, మాజీ ఎంపీపీ మంగమ్మ, సహకార సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీసీఐలోనే పత్తిని విక్రయించాలి : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : అనాజిపురంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, నవంబర్ 6 : పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ రైతులకు సూచించారు. మోత్కూరు మండలంలోని అనాజిపురంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ ఉమామహేశ్, సూపర్వైజర్ శివకుమార్, ఎఫ్ఎస్స